Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

# ఐఆర్ఐ ప్రమాణాలతో రహదారులు

## కంప్యూటరైజ్డ్ రోడ్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు: ఐవోటీ పర్యవేక్షణ

అమరావతి, ఏప్రిల్ 12 : జాతీయ రహదారులు సహా రాష్ట్రంలో వున్న అన్ని రహదారులను దేనికది ఒక ప్రాజెక్టుగా తీసుకుని నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్దేశించారు. దీనికోసం వెంటనే నాలెడ్జ్ పార్టనర్‌ను నియమించుకోవాలని చెప్పారు. 41,296 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు, 6 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను ఐవోటీతో అనుసంధానిస్తూ, ఎప్పటికప్పుడు డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా వాస్తవ స్థితిగతులను తెలుసుకునేలా కార్య ప్రణాళికను రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మాణంలో వున్న రహదారులు, వాటి నిర్వహణ, రైల్వే ఓవర్ బ్రిడ్జిలపై బుధవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

కొత్తగా ఏర్పాటుచేసిన 'కంప్యూటరైజ్డ్ రోడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' (ఏపీఆర్ఎంఎస్)పై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. దీనిపై తొలుత ముఖ్యమంత్రికి అధికారులు ప్రెజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలోని రాష్ట్రీయ రహదారులు, ప్రధాన జిల్లా రహదారులతో కూడిన రోడ్ నెట్‌వర్క్ కోసం ఏర్పాటుచేసిన ఈ రోడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను జీఐఎస్ డేటా బేస్‌తో అనుసంధానించినట్టు ప్రెజెంటేషన్‌లో తెలిపారు. ఏపీఆర్ఎంఎస్ ఫ్రేమ్ వర్కులో ప్రధానంగా 4 దశలు వుంటాయి. అందులో మొదటిది డేటా కలెక్షన్. ఇందులో రహదారి స్వరూపం, పేవ్‌మెంట్ స్థితి, దాని నిర్వహణ సంబంధిత చరిత్ర, దాని మందం, మలుపులు, రాకపోకల స్థాయి తదితర వివరాలు వుంటాయి. ఇక రెండో దశ డేటాబేస్. ఇందులో రహదారి సమాచార వ్యవస్థ, భౌగోళిక సమాచార వ్యవస్థ, రాకపోకల సమాచార వ్యవస్థ, వారధుల సమాచార వ్యవస్థ, పేవ్‌మెంట్ నిర్వహణ వ్యవస్థ తదితర అంశాలు వుంటాయి. ఇక మూడవది నిర్ణాయక సహాయ వ్యవస్థ. ఇందులో ఆర్థిక సంబంధిత విశ్లేషణ, ప్రణాళిక రూపకల్పన, పనుల అమలు, పనుల ప్రాధాన్యం వంటి వివరాలు వుంటాయి. ఇక చివరి దశలో ప్రామాణిక నివేదికలు, కస్టమ్ నివేదికలు, గ్రాఫులు, మ్యాపులు వుంటాయి.

ఇప్పటికే ప్రకాశం, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా, తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాలలో రాష్ట్ర రహదారులకు సంబంధించిన ఆర్ఎంఎస్ కంప్యూటరైజేషన్, జీఐఎస్‌తో డేటా అనుసంధానం, ప్రణాళికల రూపకల్పన పూర్తయ్యిందని ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి సుమితా దావ్రా చెప్పారు. ఈ నెలాఖరులోగా పశ్చిమ గోదావరి, కర్నూలు, మే నెలాఖరులోగా చిత్తూరు, కడప, అనంతపురము జిల్లాలలో ఈ కార్యక్రమాన్ని

పూర్తిచేస్తామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మన రహదారుల నిర్మాణాలు, నిర్వహణ వుండాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి తొలుత పైలట్ ప్రాజెక్టుగా ప్రకాశం జిల్లాలో కంప్యూటరైజ్డ్ రోడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు చేయాలని చేసిన సూచన మేరకు ఆ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేశామని చెప్పారు. ఈ జిల్లాలో 1257.66 కిలోమీటర్ల మేర వున్న 40 రహదారులపై రోడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుచేశామని తెలిపారు. 2016లో ఈ జిల్లాలో రోడ్ నెట్ వర్క్ క్వాలిటీ ఇంటర్నేషనల్ రఫ్‌నెస్ ఇండెక్స్ (ఐఆర్ఐ) స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలిందన్నారు.

రహదారుల నిర్మాణం, నిర్వహణలకు చేస్తున్న వ్యయం, అనుసరిస్తున్న విధానాలు శాస్త్రీయపద్ధతిలో లేవని, అంతర్జాతీయ ప్రమాణాలు సాధించేందుకు అనుగుణంగా వీటిని పెంపొందించాల్సిన అవసరం వుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచ ప్రమాణాలతో పూర్తిచేసిన రహదారులకు జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీలతో పరీక్షలు జరిపించి ర్యాంకులు ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. సర్టిఫికేషన్ ఇప్పించే స్థాయిలో మన రహదారులను నాణ్యతతో నిర్మించి, నిర్వహించే బాధ్యత అధికారులదేనని అన్నారు. దీనికి అవసరమైన సర్వీస్ ప్రొవైడర్లను, నాలెడ్జ్ పార్టనర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ ఇద్దరికి మధ్య నోడల్ అధికారిగా వుండటమే ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. రాష్ట్ర రహదారుల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరగాలని, అవసరమైతే కార్పొరేషన్ వివిధ ఆర్థిక సంస్థల ద్వారా నిధులను సమీకరించి వీటిని చేపడుతుందని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలను పాటించడమే కాకుండా ప్రజలు గుర్తించి చర్చించుకునే స్థాయిలో రహదారుల నిర్మాణం జరగాలని చెప్పారు. 2018 డిసెంబరు నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో వున్న, చేపట్టబోయే జాతీయ రహదారుల ప్రాజెక్టులన్నీ పూర్తయి తీరాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో చేపట్టిన రహదారి ప్రాజెక్టులను మరింత వేగంగా పూర్తిచేసేందుకు ప్రత్యేకంగా ఏడుగురు నోడల్ అధికారులను నియమించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అమరావతి–అనంతపురము జాతీయ ఎక్స్‌ప్రెస్ రహదారి, బెంజ్ సర్కిల్ ఫ్లైవోవర్ (ఎన్‌హెచ్ 16), అమరావతి బాహ్య వలయ రహదారి, ప్రాజెక్టు 6 వరుసల విజయవాడ బైపాస్ సహా విజయవాడ–గుండుగొలను, నాలుగు వరసల విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి, గుంటూరు–నరసరావుపేట (పేరిచర్ల సెక్షన్ ఎన్‌హెచ్ 544డి), భీమునిపట్నం నుంచి భోగాపురం వరకు నిర్మించే బీచ్ కారిడార్ రోడ్ ప్రాజెక్టులకు ఈ నోడల్ అధికారులు పనిచేయనున్నారు. ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టు కింద నిర్మించబోయే గ్రామీణ రహదారులకు, సాంకేతిక అభివృద్ధి, సీయం కోర్ డ్యాష్ బోర్డు నిర్వహణ, రహదారులు భవనాల శాఖలోని అంతర్గత సామర్థ్యాలు పెంపునకు సంబంధించిన శిక్షణ తదితర అంశాలను పర్యవేక్షించేందుకు మరో ముగ్గురు నోడల్ అధికారులను నియమించారు.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రానికి రూ.3,370.93 కోట్ల విలువైన పనులను కేంద్ర రహదారి నిధి (సీఆర్‌ఎఫ్) కింద మంజూరు చేసిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో 132 పనులను ఇప్పటికే చేపట్టగా కేంద్ర ప్రభుత్వం రూ.1690 కోట్లు విడుదల చేసిందని, ఇది కాకుండా విజయనగరం బైపాస్, ఎన్‌హెచ్ 340 రాయచోటి–అంగల్లు, ఎన్‌హెచ్ 75 మంగళూరు–తిరువణ్ణామలై రోడ్డు పనులకు మరో రూ.896.37 కోట్లను ఇచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో రహదారుల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి సుమితా దావ్రా, ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర, ఆర్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి. జగన్నాథరావు, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ఎవీ రాజమౌళి, నేషనల్ హైవే అథారిటీ రీజనల్ ఆఫీసర్ అనిల్ దీక్షిత్ పాల్గొన్నారు.